ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 19 నవంబరు 2025



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్ తీసుకోవాలి
- జిల్లా స్థాయి మానిటరింగ్ సమావేశంలో డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వాణిశ్రీ సూచించారు. మంగళవారం కార్యాలయంలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లాస్థాయి మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, క్లినిక్స్ డయాగ్నస్టిక్ సెంటర్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ పొందాలని, అలాగే గుర్తింపు పొందిన ఏజెన్సీతో టై అప్ చేసుకోవాలని ఆదేశించారు. వ్యర్థాలను గైడ్‌లైన్స్ ప్రకారం సెగ్రిగేషన్ చేసి, ఏజెన్సీ ద్వారా డిస్పోజ్ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా ఆసుపత్రులు వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపి పారవేస్తే జరిమానాలు విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ ఏజెన్సీలతో అన్ని ఆసుపత్రులు టైఅప్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిక్షపతి మాట్లాడుతూ బయో మెడికల్ వేస్ట్ కలెక్షన్ రేట్లు రాష్ట్ర సలహా కమిటీ నిర్ణయిస్తుందని, వాటి ప్రకారమే చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. ఏజెన్సీ రాకపోతే సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్ కృపాబాయి, డా. లక్ష్మీవేణి, సతీష్ వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

- వచ్చే నెలలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం
- పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- ముందుగా పంచాయతీ ఎన్నికలు
- మారనున్న రిజర్వేషన్లు



పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ప్రభు త్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై కోర్టులో ఇప్పట్లో తేలే అవకాశాలు లేకపోవడంతో ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం వచ్చే ఏడాది మార్చి నెలాఖరుతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో సకాలంలో ఎన్నికలు నిర్వహించకుంటే రాష్ట్రానికి రావా ల్సిన 3000 కోట్ల రూపాయల నిధులు మునిగిపోయే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం పంచాయతీ ఎన్ని కలు వచ్చే నెలలో నిర్వహించాలని నిర్ణయం తీసు కుంది. దీంతో ఈ ఎన్నికలపై గ్రామాల్లో, ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. అయితే ఇదివరకే గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, మండల జిల్లా పరిషత్‌లో ఎంపీటీసీలు, జడ్పిటిసి స్థానా లకు ప్రకటించిన రిజర్వేషన్లు మారనున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కులగణన ప్రకారం కేటాయిం చగా, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ప్రాతిపదికన ఖరారు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతా నికి మించి రిజ ర్వేషన్లు మించరాదు. మళ్లీ ప్రభుత్వం ఆ ప్రాతిపదికన రిజర్వే షన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 263గ్రామ పంచాయతీలు, 2432 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటికి ఇది వరకే రిజర్వేషన్లు ప్రకటించారు. సంబం ధిత అధికారులు ఎన్నికల నిర్వహణకు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు.

● నెరవేరని ఎన్నికల హామీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నెరవేరకుండా పోనున్నది. రిజర్వేషన్లు కల్పించేందుకు గాను ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలను, జూన్, జూలైలో జరగాల్సిన మండల జిల్లా పరిషత్ ఎన్నికలను, ఈ ఏడాది జనవరిలో జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు గత ఏడాది ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కులగణనను చేప ట్టింది. అంతేకాకుండా ఒక డెడికేషన్ కమిషన్ కూడా వేసింది. కుల గణనలో బీసీల సంఖ్య 56 శాతానికి పైగా

(మిగతా 8వ పేజీలో)

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలనికలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సంద ర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణు, డీసీపీ కరుణాకర్‌లతో కలిసి అధికారులు, కలెక్టరేట్ సిబ్బందిచే మాదకద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, డ్రగ్స్ రహిత జీవన శైలి అనుస రిస్తూ, మన చుట్టూ ఉన్న ఎవరు డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. యువత జీవితాలను డ్రగ్స్ మహమ్మారి నాశనం చేస్తుందని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా అధికారులకు తెలుపా లన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి .వనజ, ఏసిపి గజి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వైద్యులకు సూచించారు. మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సందర్శించారు. వార్డుల ఆధునికీకరణ, అత్యవసర సేవల విస్తరణ, పరిశుభ్రత, పర్యావరణ నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులతో వైద్య సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. రోగులకు అవసరమయ్యే అత్యాధునిక పరికరాలు, సిబ్బంది నియామకం, అత్యవసర సేవలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సిమ్స్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పడకల స్థాయిని 732కు పెంచామని, త్వరలోనే సింగరేణి ఆసుపత్రిలో క్యాత్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేసి గుండె వ్యాధి నిపుణులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్టు ఆయన చెప్పారు. సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, సూపరింటెండెంట్ దయాల్, ఆర్ఎంఓలు దెండె రాజు, కృపాబాయి, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, దూళికట్ట సతీష్, రహీం పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

అంతర్గాం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో చదివే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఎల్లంపల్లిలోని కేజీబీవీ పాఠశాల, అంతర్గాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల బోధన శైలి, పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. వారితో కలిసి భోజనం చేశారు. పిల్లలకు ఏ మేరకు పాఠాలు అర్థమవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ నిర్వహించాలని, ఖాన్ అకాడమి, ఫిజిక్స్ వాలా కోర్సులు విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. చలి తీవ్రత పెరిగిందని, వాటర్ హీటర్స్ అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఏమైనా అవసరం ఉంటే వెంటనే ప్రతిపాదనలు అందించాలని ఆయన తెలిపారు. అనం తరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఔట్ పేషెంట్ వివరాలు, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న పలు వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్ఓ కల్పన, ఉపాధ్యాయులు, వైద్యఅధికారి ఉదయ్ కిరణ్ ఉన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

కోల్‌సిటీ/అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గోదావరి తీరంలో నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని, గోలివాడ సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోదావరిఖని రూ.5కోట్లతో జరుగు తున్న అభివృద్ధి పనులపై వాకబు చేశారు. జనవరిలో జరిగే ఈ జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుంటారని, జాతర నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలన్నారు. సింగరేణి సంస్థ త్వరగా పనులు పూర్తి చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. జాతర నిర్వహణ సమయంలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. రోజు చెత్తను శుభ్రం చేయడం, విద్యుత్ దీపాలంకరణ, జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతర నిర్వ హణకు సంబంధించి పోలీస్, సింగరేణి, నీటి పారుదలశాఖ, రెవెన్యూ, దేవాదయశాఖ, మున్సిపల్ కార్పొరేషన్లు సంయుక్తంగా సమన్వయంతో పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ రామన్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, డీపీవో వీరబుచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.



సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో కలెక్టర్ శ్రీహర్ష

రాత్రి పూట వాహనాల రాకపోకల నియంత్రణ

- హైవేలపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు, ప్రమాదాలను నివారించేందుకు రహదారులపై రాత్రిపూట వాహనాల రాకపోకలపై నియంత్రణ పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రాత్రి సమయంలో ఆలస్యంగా, తెల్లవారు జామున ప్రయాణంలో చోటు చేసుకుంటున్న ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో పలు చర్యలు చేపట్టామన్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపడుతారన్నారు.

నిద్రమత్తు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మితి మీరిన వేగం కారణాలతో రాత్రి, తెల్లవారు జామున ఎక్కువ ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాత్రి 11గంటల తరువాత అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో రోడ్డు పక్కన, నేష నల్ హైవేలు, జంక్షన్లు, సర్వీస్ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ మొదటి ప్రాధాన్యమని, రాత్రి వేళల్లో పర్యవేక్షణ, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత కఠినంగా అమలు చేస్తామని సీపీ పేర్కొన్నారు.

పాత పద్ధతి ప్రకారమే పత్తి కొనుగోలు చేయాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్త నిబంధనలు ఎత్తివేసి, పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో అధికారులతో మాట్లాడి రాజీవ్ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గి రైతులు ఆవేదన చెందుతున్న నేపథ్యంలో కొత్త నిబంధనలు తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తేమ శాతం, దిగుబడిలో 25 శాతం కొనుగోలు చేస్తామని, వివిధ రకాల యాప్‌లతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇలాంటి నిబంధనల వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్రంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్న రైతుల పక్షాన నిలబడడం లేదన్నారు. దీంతో జిన్నింగ్ మిల్లులు సమ్మెబాట పట్టాయన్నారు. రైతులు ఎక్కడా పత్తి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ళ పత్తి కొనుగోలు ఎత్తి వేసి రైతు దిగుబడి మొత్తం కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధర రూ.8,110కి తగ్గకుండా కొనుగోలు చేయాలని సూచించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పాత పద్ధతిలో సేకరించాలని, లేకుంటే రైతుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్, రఘువీర్‌సింగ్, మర్కు లక్ష్మన్, ఉప్పు రాజ్‌కుమార్, లూశెట్టి భిక్షపతి, పెంచాల శ్రీధర్, కొయ్యడ సతీష్, వెన్నం రవీందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీఆర్ఎస్ రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ప్రభుత్వ భూమిలో సామూహిక భోజనాలు



భోజనాలు చేస్తున్న మాస్టిన్ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): భూమి మాదేనని కాల్వశ్రీరాంపూర్ చెందిన మాస్టిన్ కులస్తులు మంగళవారం సామూహిక భోజనాల కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు ప్రభుత్వ భూమిలో పూరిగుడిసెలు వేసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కులసంఘం అధ్యక్షుడు దంతనపల్లి స్వామి మాట్లాడుతూ తమ కులస్తులకు ఉండటానికి ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, 597 సర్వే నెంబర్‌లో తామంతా సోమవారం భూమి చదును చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇవాళ పెద్దు వేసుకొని భోజనాలు చేస్తున్నామని, దీనిపై ప్రభుత్వం స్పందించి తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జిన్నింగ్ మిల్లు ల యాజమాన్యాలు సమ్మెను విరమిస్తున్న నేపథ్యంలో పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో ప్రైవేట్ కొనుగోళ్లు, జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కొనుగోళ్లు జరుపుతా మని, రైతులు ఎవరైనా సీసీఐకి పత్తి అమ్ముకోవా లంటే వెంటనే స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, అలాగే పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోళ్లు ఉంటాయన్నారు.

జనావాసాల్లో వైన్ షాప్ వద్దు

కలెక్టర్, సీపీ, ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసిన బాధితులు



గాంధీ విగ్రహం ఎదుట నిర్వహిస్తున్న వైన్స్

ధర్మారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో వైన్‌షాప్ వద్దని ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అంద జేశారు. 20 సంవత్సరాల క్రితం వైన్స్ ఏర్పాటు చేసి నప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఇండ్లు లేవన్నారు. ఇప్పుడు ఆ ప్రాంతమంతా కమర్షియల్ ఏరియాగా మారడమే కాకుండా వందల కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. దీంతో వైన్స్ చుట్టుపక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైన్స్ పక్కనే సిట్టింగ్ పాయింట్ ఉండడంతో నిత్యం మద్యం ప్రియులతో రద్దీగా ఉంటుంది. సిట్టింగ్ పాయింట్లలో నానా హంగామా చేస్తూ మల, మూత్ర విస ర్జన చేస్తున్నారని చుట్టు పక్కల నివాసం ఉంటున్న కుటుంబాలు వాపోయారు. చుట్టు పక్కల కుటుంబాల అభ్యంతరంతో ఇంటి యజమానులు వైన్స్ కోసం అద్దెకు ఇవ్వమని తేల్చి చెప్పారు. దీంతో నిర్వాహకులు పాత వైన్స్ పక్కన ఖాళీ స్థలంలో షెడ్డు వేసి వైన్స్ నిర్వహణ చేపట్టాలని పట్టుబడుతున్నారని తెలిపారు. చేసేది ఏమి లేక ఎక్సైజ్ శాఖతో పాటు అధికారులకు ఫిర్యాదు చేశామని పాత యజమానులు తెలిపారు. గాంధీ విగ్రహం ఎదుట, బస్టాండ్ సమీపంలో వైన్స్ నిర్వహన ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇళ్లు ఖాళీగా ఉంటున్నాయి
చిలుముల రాయమల్లు (ఇంటి యజమాని)



ఇంటి పక్కన వైన్స్ ఉండడంతో మందుబాబు లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇండ్లలోకి ఎవరు కిరాయికి రావడం లేదు. వచ్చిన మందు బాబుల చేష్టలతో కొద్ది రోజులకే ఖాళీ చేసి వెళ్త న్నారు. వైన్స్ జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాం.

కొత్త వైన్స్‌కు ఇంకా పర్మిషన్ ఇవ్వలేదు
జీవన్‌రెడ్డి (ఎక్సైజ్ ఎస్సై)

ధర్మారంలో కొత్త వైన్స్ కోసం పర్మిషన్ కావాలని టెండర్ దక్కించుకున్న వారు ఎవరూ రాలేదు. ఎక్కడ వైన్స్ ఏర్పాటు చేసిన నిబంధనలకు అనుగుణంగానే ఉన్నతాధికారులు పర్మిషన్ ఇస్తారు. సోమవారం వైన్స్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సిటింగ్ పాయింట్ ఏర్పాటు చేశారంటే పరిశీలించి తొలగించాం.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం 6

42 శాతం వాటా తేల్చేవరకు ఉద్యమం
బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష 8

నిరుపేదల సంక్షేమానికి కృషి
కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ 8

పంచాయతీ పైపులు మాయం

- పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు18(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగు నీటి పైపులు మాయమయ్యాయి. సుమారు 30 పైపులు కనిపించకుండాపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం ఆరా తీశారు. మండలంలోని గర్జనపల్లికి చెందిన రైతు బంతిలాల్ వ్యవసాయ పొలంలో పైపులు వేస్తుండడాన్ని గమనించారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. సదరు రైతు నుంచి పైపులను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ వివరించారు. గ్రామంలోని ఓ పార్టీ నాయకుడు పంచాయతీ పైపులను ఒక్కో దానికి రూ.వేయి చొప్పున సుమారు 90 పైపులను విక్రయించారని విచారణలో తేలినట్లు సమాచారం.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న మదురాల నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. తాళం వేసిన ఇంటి గదుల నుంచి మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. అక్కడి చేరుకునే సరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు ఆర్పేందుకు యత్నించారు. ఇంటిలోని విలువైన పత్రాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాట్లిందని బాధితులు పేర్కొన్నారు.

15 మందికి జరిమానా

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో మద్యంసేవించి వాహనాలు నడిపిన 15మందికి జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కోర్టు కానిస్టేబుల్స్ తిరుపతి, జీవన్ మద్యంసేవించి వాహనాలు నడిపిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జిల్లా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జయశ్రీ 12మందికి రూ.1000, మరో ముగ్గురికి రూ 5వేల చొప్పున జరిమానా విధించారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో దూకి పంపరి అజయ్ (34) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూరాబాద్‌కు చెందిన అజయ్ తల్లి ఇటీవల మృతిచెందగా అజయ్ ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 11న తల్లి పెద్ద ఖర్మ ఉండగా 9న అజయ్ ధర్మపురికి వచ్చాడు. అదే రోజు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రాయపట్నం వద్ద గోదావరి నదిలో మంగళవారం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. అజయ్ సోదరి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.


పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి

గణేశ్‌నగర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్ ఆగస్టులో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సుల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో విద్యార్థినులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల అదనపు నియంత్రణాధికారులు పాల్గొన్నారు.

- చిన్నచిన్న కారణాలతో కుటుంబసభ్యుల హత్యలు
- కాలయములుగా మారుతున్న కన్నవారు



కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల తీవ్ర తను చూస్తే మనుషుల విపరీతమైన నేర ప్రవర్తనపై అసహ్యం వేస్తున్నది. మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు మాయమవుతున్నాయి. మనుషులు డబ్బులు, సంపదపై మమ కారాన్ని పెంచుకుంటుండంతో మానవ సంబంధాలు మాయమవుతున్నాయి. భర్తను భార్య హత మార్చడం, భార్యను భర్త హత్య చేయడం, తండ్రిని కొడుకు, కొడుకు, కూతుర్లను తండ్రి చంపడం వంటి ఘటనలు అందరిని కలచి వేస్తున్నాయి. నాగరిక సమాజంలో ఆటవికమైన నేర ఘటనలు చోటు చేసు కోవడం విచారకరం. జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తు న్నాయి.

దివ్యాంగులైన పిల్లలను వదిలించుకునేందుకు..

తాజాగా కన్నతండ్రే దివ్యాంగులైన కన్న కూతురిన హత్య చేసి, కొడుకును హత్య చేసేందుకు యత్నించిన ఘటన కరీంనగర్‌లో చోటు చేసుకుంది. కన్న పిల్లలను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రే ఆ దివ్యాంగుల పాలిట కాలయముడవ ఇం దారుణం. పోషణ భారమవతున్నదనే కారణంగానే తన కూతురు, కొడుకును కనికరం లేకుండా విషంఇచ్చి హతమార్చే యత్నం చేశాడు. అది విఫలమవటంతో టవల్‌తో గొంతుకు ఉరిబిగించి చంపాలని ప్రయత్నించాడు. కూతురు మరణించింది. కొడుకు కొన ఊపిరితో ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. అనంతరం తండ్రి మల్లేశం ఇంటి నుంచి పరారుకాగా రెండు రోజుల తరువాత త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

● మరో ఘటనలో 2020 ఫిబ్రవరి 10న కరీంనగర్‌లోని విద్యాగనర్ ప్రాంతంలో ఇంటర్ చదువతున్న ముత్త రాధిక(17) అనే దివ్యాంగులరాలిని ఆమె కన్న తండ్రి కొమురయ్య కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఆపై గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలు, సెల్‌టవర్ డంపును పరిశీలించిన పోలీసులకు అనుమానంవేసి లోతుగా విచారణ జరపగా తండ్రే హత్య చేసినట్లు వెల్లడైంది. నిందితుడు ఘటనస్థలంలో ఎలాంటి ఆధా రాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అప్పటి పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాలను సేకరించారు. ఎంత డబ్బు ఖర్చుచేసినా దివ్యాంగురాలి ఆరోగ్యం బాగుపడటంలేదని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు ఘటనల్లో తండ్రులైన నిందితులు కన్నకూతుర్లను అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిందిపోయి, చిన్నతనం లో గోరుముద్దలు తినిపించిన తండ్రులే అవే చేతులతో కర్కశంగా చంపివేశారు. జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

ఆస్తి తగాదాలతో

జిల్లాలో ఆస్తి తగాదాలతో తండ్రులను కొడుకులు హతమార్చటం, సోదరులు ఒకరిని ఒకరు చంపటం, వివాహేతర సంబంధాలతో భార్య భర్తను, భర్త భార్యను, ప్రియురాలిని హత్య చేసిన ఘటనలు చాలానే జరిగాయి. ఇటీవల కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వివాహేతర సంబంధంతో ప్రియుడితో కలిసి మద్యంలో పురుగుమందు తాగించి భర్తను హత్య చేయించింది.అంతకు ముందు భగత్ నగర్‌లో ప్రియురాలిని ప్రియుడు ఇంటికి పిలిచి బండ రాయితోబాది హత్య చేశాడు. కొన్నేళ్ల క్రితం భగత్ నగర్ ప్రాంతంలో దంపతుల నిద్రకు ఆటంకం కలిగిస్తూ రాత్రివేళ ఏడుస్తున్నదనే కారణంగా ఏడాది వయస్సున్న చిన్నారిని కన్నతల్లి నీటి సంపులో వేసి చంపింది. విద్యానగర్ ప్రాంతంలో ఆస్తి తగాదాలతో సోదరుడిని అతనిసోదరే రోకలిబండతో బాదిహత్య చేసింది.

వరుస చోరీలతో బెంబేలు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో రంగనవేని మల్లయ్యకు చెందిన రెండు దూడలను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అదే రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయంలోని పెద్ద కంచు గంటను దొంగిలించారు. స్థానిక భక్తులు మంగళవారం ఉదయం చోరీకి గురైనట్లు గుర్తించారు. అదే ఆలయంలో గతంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం గునుకుల కొండాపూర్‌లో పలువురు రైతులకు చెందిన నాలుగు ఆవులను దొంగలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూర్, బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గన్నేరువరం : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని గుండ్లపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం. మంగళవారం మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండ్లపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడం, అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేదాన్ష్ (5) అనే బాలుడు మృతి చెందాడు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన పొలాస విజయ్-నందిత దంపతులు కుమారుడు వేదాన్ష్‌తో కలిసి పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉంటున్నారు. సోమవారం తీవ్ర జ్వరంతో బాధపతుండంగా వేదాన్ష్‌ను కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ చిల్డ్రన్స్ ఆసుప్రతిలో చికిత్స కోసం తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు మందులు రాసి ఇవ్వగా ఇంటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వేదాన్ష్‌కు తీవ్ర జ్వరం రాగా మరోమారు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యుడు ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని సూచించగా తల్లిదండ్రులు సమ్మతించకపోవడంతో మరోమారు మందులను ఇచ్చి పంపాడు. మంగళవారం ఉదయం వేదాన్ష్ తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వైద్యుడు బాలుడికి వైద్యం అందిస్తున్న సమయంలో మరింత తీవ్ర అస్వస్థతకు గురికాగా వైద్యుడు సీపీఆర్ చేసి రికవరీకి ప్రయత్నించాడు. అదే సమయంలో బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిరంజీవి తన సిబ్బందితో అక్కడ చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.



వేదాన్ష్(ఫైల్)

జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అంజిరెడ్డి, మెడికల్ అధికారి ఉపెందర్‌లు ఆసుపత్రికి చేరుకొని బాలుడిని పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ తాను చేసిన వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదని, బాలుడిని ఆసుపత్రిలో ఉంచాలని తల్లిదండ్రులను కోరినప్పటికీ చేర్పించలేదని తెలిపారు. చివరికి స్థానిక ఐఎంఏ సభ్యులు మృతుడి బంధువులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సెస్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు



సిరిసిల్ల సెస్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న పలు అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్‌గౌడ్‌లు బృందాలతో సెస్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు చెందిన పలు రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను కాపీ చేసుకుని తీసుకెళ్లారు. దీనిపై సెస్ ఎండీని వివరణ కోరగా పలు ఫిర్యాదులకు సంబంధించి విచారణకు వచ్చి వారికి అవసరమైన రికార్డులను తీసుకెళ్లారని తెలిపారు.

వీఏవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఏవోలు

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంభీరా వుపేట మండలం ముచ్చర్ల నూతన గ్రామ సంఘం వీవోఏ విస్లావత్ పద్మపై కొందరు దాడి చేసి గాయ పర్చారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డికి మండల వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కురాకుల దేవలక్ష్మి మంగళవారం పిర్యాదు చేసింది. ప్రభు త్వం మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్ప గించగా, ముచ్చర్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న పద్మపై ఐదుగురు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను అడగా, ఫిర్యాదు ఇచ్చిన రోజే వారిపై కేసు నమో దు చేశామని తెలిపారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపల్లివాగు వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వల పన్ని ముగ్గురు యువకులను పట్టుకుని అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ గ్రామాలకు చెందిన యువకులు మంద ప్రశాంత్, గనగోని అరవింద్, బుర్క సాయిరాజులు కలిసి కరీంనగర్ జిల్లాలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. కొంత గంజాయిని తాగడంతో పాటు మిగిలిన దానిని మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని రాపల్లి వాగు వంతెన వద్ద ఈ నెల 17న గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, తాగే వారి వివరాలను 100 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

భూవివాదంలో బెదిరించిన ఐదుగురిపై కేసు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గౌతమి నగర్‌కు చెందిన 944/బిలోని 270 గజాల స్థలం వివాదంలో బెదిరింపులకు పాల్పడ్డారని మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన బోళ్ల సత్యనారాయణ ఫిర్యాదుతో ఐదుగురిపై కరీంనగర్ వన్‌టౌన్‌లో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు. భూవివాదంపై మాట్లాడుకుందామంటూ ఈ నెల 12న తనను కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయానికి పిలిపించారని, బయటకు వెళ్లకుండా అడ్డుకొని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థలం నుంచి ఖాళీ చేయకుంటే తీవ్రపరిణామాలుంటాయని, కాంపౌండ్‌ను కూల్చివేస్తామని బెదిరించారని తెలిపాడు. ఈ మేరకు పంజాల శ్రీనివాస్, కొయ్యడ సృజన్‌కుమార్, న్యాలపట్ల రాజు, బండ రాజిరెడ్డి, రాజవేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల ప్రచార జాతా మంగళవారం హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్నామని పదేపదే చెప్పిన కూడా కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. శాంతి చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రత విభాగాల వైఫల్యం వల్లనే కశ్మీర్, ఢిల్లీలో పేలుళ్లు జరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కళావేన శంకర్, ఏఐయూఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, నాయకులు అనిల్, నర్సింహ, రెహమాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కేదారి, బాబు, సృజన్‌కుమార్, లక్ష్మి, వెంకటేష్, అయిలయ్య, రత్నాకర్, మల్లేష్, సత్యనారాయణ, రాము, సాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

వేగవంతంగా పూర్తి చేయాలి

- హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ ద్వారా మల్యాల మండలంలోని సర్వాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం హడ్కో అధికారులు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అన్ని పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్, అధికారులు ఉన్నారు.



మల్యాల మండలం సర్వాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

- రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట : జనక్‌ప్రసాద్

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలను మంగళవారం జనక్‌ప్రసాద్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఏసీపీ రమేష్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో ఆటలకు ఒక పీరియడ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసినట్లు తెలిపారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలన్నారు. సింగరేణి స్టేడియంలో సమాజ హితమైన పనులకు అవకాశం కల్పిస్తామన్నారు. అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ మాట్లాడుతూ మొదటి సారిగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీ లను పెద్దపల్లి జిల్లాలో నిర్వహించడం గర్వకారణ మని, రాబోయే రోజుల్లో మరి న్ని పోటీలను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృ ద్ధి అధికారి అక్కపాక సురేష్, ప్రకాశం, రాష్ట్ర బాధ్యులు శోభారాణి, శ్రీనివాస్, పేట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సురేందర్, దాసరి రమేష్, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్, అధికారులు శశికుమార్, శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు శైలజ, మాధవి, జావీద్, వెంకటేష్, దుర్గాప్రసాద్, ఖాజాబీ, రేణుక, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 52 మంది ఎంపిక

సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో అండర్-14 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు వేదికైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 277 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలుత ఎంపిక పోటీలో 52 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అందులో 26 మంది బాలురు, 26 మంది బాలికలు ఉన్నారు. వీరికి సింగరేణి సిటూ టైప్ క్వార్టర్‌లను వసతి కోసం కల్పించింది. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులను ఈ నెల 30 ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు.



స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనక్‌ప్రసాద్

చెరువులో బావి తవ్వకంపై విచారణ



బావి తవ్వకంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్త చెరువులో బావి తవ్వకంపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని కొత్తచెరువులో ఓ వ్యక్తి బావి తవ్వుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు పనులు నిలిపివేయించారు. మంగళవారం పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. బావి తవ్వే వ్యక్తిని భూమి పట్టా సంబంధించిన పాసుబుక్‌లను తీసుకొని రావాల్సిందిగా సూచించినట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో ఇరిగేషన్ ఏఈ నవీన్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ ఆనంద్, సర్వేయర్ చామంతి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్, మణికంఠ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

నేడు వేములవాడలో హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిండిన హుండీలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 9,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,338 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికలను పార్టీ పరంగా రిజర్వేషన్లతో నిర్వహించేందుకు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుల ఆమోదానికి రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తేవాలని, లేదా రాజీనామా చేసేందుకు సిద్ధపడాలని సూచించారు. ఈ సమావేశంలో చింతలోటి రామస్వామి, బుర్రదశగౌడ్, హేలపతి, దేవయ్య, ఒన్నారపు దేవయ్య, గణేష్, తిరుపతి, ప్రభాకర్, రవీందర్, రాజేష్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కల్యాణ కట్ట.. సమస్యల తిష్ట

- పనిచేయని వేడినీళ్ల ప్లాంటు
- ఆరుబయటనే పుట్టువెంట్రుకలు
- కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి


కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి


ఇరుకైన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సమస్యలకు తిష్టగా మారింది. కార్తీక మాసం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న సన్నిధిలో రూ.150కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రావిచెట్టు వద్ద ఉన్న కల్యాణకట్ట-1ను చెక్‌పోస్టు వద్దకు మార్చారు. మరో కల్యాణకట్ట-2ను అమ్మవారి గెస్ట్ హౌస్ వద్ద తాత్కాలికంగా టెంట్లువేసి కొనసాగిస్తున్నారు. ఈ కల్యాణకట్టను రాజేశ్వరపురం కిందిభాగంలో ఏర్పాటు చేయాలని రూపకల్పన చేసినప్పటికీ ముందుకు సాగడంలేదు. తలనీలాల కాంట్రాక్టు ద్వారా ఆలయానికి ఏటా రూ. 15కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ కల్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించడం ఇబ్బందిగా మారింది. కల్యాణ కట్టలో భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీసేందుకు అవసరమైన నీడ కరువైంది. కల్యాణకట్టకు ఎదురుగా ఆరుబయటనే చిన్నారులకు పుట్టు వెంట్రుకలు తీస్తున్నారు. కల్యాణకట్ట వద్ద చిన్నారులకు వేడినీళ్లు లభించక చలికి విలవిలలాడుతున్నారు. పార్వతిపురం-1 బ్లాక్ వద్ద వేడినీళ్ల ప్లాంటు ఏర్పరిచి నప్పటికీ ఉపయోగపడడం లేదు. కల్యాణకట్టకు కొంత దూరంగా ఉండడంతో బయటనే వేడినీళ్లు తెచ్చుకొని చిన్నారులకు స్నానాలు చేయిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన నల్లాల వద్దనే భక్తులు స్నానాలు చేస్తున్నారు. ఇవి దూరంగా ఉండడంతో భక్తుల స్నానాలకు ఇబ్బందులు నెలకొన్నాయి. అసౌకర్యాల మధ్య భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. రాజేశ్వరపురం చివరన కిందిభాగంలో భక్తుల స్నానాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పరిచి నల్లాల పాయింట్ ఏర్పరిచారు. ఇప్పటివరకు ఫ్లోరింగ్ మొదలు పెట్టలేదు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 120 నల్లాలను బిగించడానికి రూప కల్పన చేసినప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు. సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న నేప థ్యంలో ఇప్పటికైనా పూర్తిసౌకర్యాలతో కల్యాణ కట్టను ఏర్పాటు చేసి భక్తుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

ధర్మగుండం మూసివేత

ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో ధర్మగుండంను మూసివేశారు. అయితే కార్తీక మాసం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు చోటేలేదు. భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు, ఆర్జిత సేవలు చేసుకునే భక్తులు పుణ్యస్నానాలు చేయాలంటే వసతిగదులే తప్ప ఎక్కడా చోటు లేదు. ఆలయ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి నల్లాల వద్ద స్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. మహిళలకు డ్రెస్సింగ్ రూంలు లేకపోవడంతో కష్టంగా మారింది.

భీమేశ్వరసదన్ ఎదుట బురదమయం

ప్రసాదాల తయారీతో వచ్చే నీటితో భీమేశ్వర సదన్ ఎదుట బురదమయంగా మారింది. భీమేశ్వరసదన్‌లోనే ఈవో, ఇంజనీరింగ్, ప్రొటోకాల్ కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్య బుకింగ్‌కు పక్కన సదన్ ఎదుట బురదగా మారడంతో ఆలయానికి వచ్చే వీఐపీలు, కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరోవైపు కోడెల క్యూలైన్ పక్కనే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుక, కంకర ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.


బురదగా మారిన భీమేశ్వర సదన్ ప్రధాన ద్వారం

కల్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం

- రాజేష్, ఈఈ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

కళ్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం. భక్తుల స్నానాలకు దాదాపు 120 నల్లాల ద్వారా షెవర్స్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కళ్యాణకట్ట-1లో తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం వెనుకభాగాన నల్లాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ త్వరలో ఫ్లోరింగ్ చేసి నల్లాలు వినియోగంలోకి తీసుకువస్తాం. ఇందుకు రూ. 15లక్షలు కేటాయించాం. భీమేశ్వర ఆలయంలో రూ. 3.60కోట్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో నిర్మాణానికి క్యూలైన్ పక్కన వేసిన మెటీరియల్ తొలగిస్తాం.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

● అమ్మవారికి బోనం సమర్పించేందుకు చలిలోనే క్యూ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తజన సందడి నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు తెల్లవారుజామునే క్యూ కట్టారు. వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. బద్దిపోచమ్మ ఆలయం ఎదురుగానే నీటి గుంత ఏర్పడడంతో భక్తులు ఇబ్బందుల పాలయ్యారు.

భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం

కార్తీకమాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసినిలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం సుహాసినిలకు వాయనం అందజేశారు.

బీడి కార్మికుల పిల్లల ఉపకారవేతనాలు

● ఈ నెల 30 వరకు గడువు పెంపు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ, వెల్ఫేర్ కమిషనర్, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు బీడి కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకారవేతనాలు దరఖాస్తులు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా బీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రభుత్వ ఆమోదిత కళాశాలలు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంసీఏ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ప్రోత్సహించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు రూ. 1,20,000 లోపు ఆదాయం కలిగి ఉండాలని, గత సంవత్సర విద్యార్థి మార్క్స్ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, తల్లి లేదా తండ్రి బీడీ కంపెనీ ఐడీ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనంకు బారులు తీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాడా జైజంక్షన్, ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అరగంట సమయం పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోదావరి హారతి


ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న మంత్రి అడ్లూరి తదితరులు


కోటిలింగాలలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 28వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గోదావరి నది వద్ద హారతి పూజల్లో పాల్గొన్నారు. అత్యంత గోదావరి నది మాతకు హారతి ఇచ్చి నదిలో కార్తీక దీపం వదిలి పెట్టారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, నేదునూరి శ్రీధర్, బాదినేని వెంకటేష్, ఒజ్జల సౌజన్యానరేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం పరమ పవిత్రమని కార్యక్రమంలో పాల్గొడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాబోవు కాలంలో గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోదావరి నది వద్ద మురికి నీరు కలువకుండా సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తామన్నారు.

కోటిలింగాలలో ప్రత్యేక పూజలు

వెల్లటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి వారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తితో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి అభిషేకం, అర్చన, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, రాపాక కోటయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న టిప్పర్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలం నుంచి రుద్రంగి మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని చందుర్తి సర్కిల్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మానసాదేవి ఆలయంలో భక్తుల రద్దీ


మానాసాదేవి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి కార్తీక మాసం చివరి మంగళవారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాగంణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కోనేటిలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించగంతో కార్తీక శోభను సంతరించుకుంది.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, తర్రె మనోహర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జక్కు మోహన్, పిసరి చిన్నభూమయ్య ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని టి. కమలిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. సిల్వర్ మోడల్ సాధించిన కమలినిని పాఠశాలలో అభినందించారు.

గొర్రెల పెంపకందారుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షు డిగా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన బాసవేని మల్లేశం యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో జిల్లా పశు వైద్య అధికారి లింగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్‌లుగా అగిత రవీందర్, కటిక రెడ్డి బుచ్చన్న, కాల్వ సురేష్, గడ్డి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, చౌటపల్లి రంజిత్, దాడి అంజనేయులు, దాడి సదయ్య, దాని ఓదెలు, బద్దుల రాజ్ కుమార్, ముక్కెర సదానందం ఎన్నికయ్యారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధి వీర్లపల్లెలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని అన్నబోయిన శ్యాంసుందర్(45) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. దీంతో శ్యాంసుందర్ భార్య నాలుగు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సక్రమంగా డ్యూటీలు చేయకుండా అతిగా మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం వీర్లపల్లె శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వేములవాడలో పేరిణి శివతాండవ నృత్యం

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర సదన్ ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవ నృత్యం ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం అలరించింది. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆచార్య గురు కళాకృష్ణ ఆధ్వర్యంలో పుష్పాంజలి, దేవి స్తోత్రం, పంచలింగ స్తోత్రం , మేలప్రాప్తి, శివపంచలింగ శబ్దాలు తదితర నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శనలు తిలకించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కళాకారులు సత్కరించారు. అనంతరం కళాకారులను విప్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇవో రమాదేవి, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రావణ్‌కుమార్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జి. అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ఆంధ్రనాట్య ప్రదర్శన

భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

● ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం భక్తులకు కల్పించాల్సిన వసతులపై జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్‌బీగితే, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా భీమేశ్వరస్వామి ఆలయానికి రోజుకు ఎంతమంది భక్తులు వస్తున్నారని ఏఏ మొక్కులు చెల్లించుకుంటున్నారనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయంలో వసతులు కల్పించాలని సూచించారు. క్యూలైన్లు, వివిధ ప్రత్యేకపూజలు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్నరావి చెట్టు వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయ్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారీ, ఈఈ రాజేష్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సచివాలయ సెక్షన్ ఆఫీసర్‌గా అనిల్


అనిల్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్‌రావు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అనిల్‌కు హైదరాబాద్‌లోని సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రామగిరి మండలంలోని 8వ కాలనీకి చెందిన ఆయన పీజీ చదువుతుండగానే గ్రూప్ 4కు ఎంపికై రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల గ్రూప్ 2 పరీక్షలు రాసి, ఎంపిక కాగా ఆయనను శాసనసభ సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. మంగళవారం తహసీల్దార్ జగదీశ్వర్‌రావు అనిల్‌ను శాలువాతో సన్మానించారు. డిప్యూటీ తహసిల్దార్ గర్రెపల్లి శంకర్, సీనియర్ అసిస్టెంట్ అజీమ్, ఆర్ఐ నిహారిక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోల్‌సిటీటౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు ఫైర్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్‌లోని పని విభాగాలు, సిబ్బంది పనితీరుపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలను ఎలా అరికట్టాలి, ప్రమాదాల నుంచి మనల్ని ఏ విధంగా కాపాడుకోవడం అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఫైర్ ఆఫీసర్, సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ కన్వీనర్‌గా ఐలయ్య యాదవ్

సుల్తానాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ బీసీ జేఏసీ కన్వీనర్‌గా సుద్దాల గ్రామానికి చెందిన బొంకూరి ఐలయ్యను నియమించినట్లు బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. ఐలయ్య మాట్లాడుతూ బీసీ సమాజ సమస్యలు గుర్తించి, పరిష్కార దిశగా ముందుకు సాగుతానన్నారు. అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా జేఏసీ వేదికగా పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు. నియామకానికి సహకరించిన చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గుడిమిట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గాజుల లక్ష్మీరాజమల్లు ఆలయ నిర్వాహకులు

సుల్తానాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం గుడిమిట్ట రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఆలయంలో ఆకుల రాములు దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు రెండువేల మంది భక్తులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు తదితరులు ఆలయంలో స్వామి వారికి అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల భాములనాయక్ తండాలో మంగళవారం కన్నాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

పాలకుర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేమునూర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి తన వంతు కృషి చేస్తానని మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన వివేక్ మాట్లాడుతూ కోనేటి ఏర్పాటుతో పాటు ఇతర అవసరాలకు విశాఖ చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా 50 వేల రూపాయలను అందిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

పాలకుర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గుండె, కంటి వ్యాధులకు లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు, నేత్రవైద్య నిపుణులు పూదరి దత్తగౌడ్ సమకారంతో నిర్వహించారు.

ఆర్డీవో ఆఫీసు తరలింపు

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్డీవో ఆఫీసు స్థానిక డిపో ఎదురుగా ఉన్న ప్రైవేట్ భవనంలోకి మంగళవారం తరలించారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మిస్తుండటంతో భవనాన్ని ఖాళీ చేసి సామగ్రిని తరలించారు. వివిధ పనుల నిమిత్తం తమ కార్యాలయానికి వచ్చే డివిజన్‌లోని ప్రజలు గమనించాలని ఆర్డీవో సురేష్ కోరారు.

22న అందెశ్రీ సంస్మరణ సభ

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ సంస్మరణ సభను ఈనెల 22న అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి మంగళవారం తెలిపారు. ఈకార్యక్రమానికి ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ కాసీం తోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అందెశ్రీకి ఘనంగా నివాళులర్పించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల టూర్


రామప్ప వద్ద విద్యార్థులు

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాత్రాదాన్ ద్వారా ఉచితంగా కల్పించిన బస్సు సౌకర్యంతో జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు రామప్ప, లక్నవరం యాత్రకు మంగళవారం వెళ్లారు. కాకతీయ కళా వైభవం, ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిన రామప్ప కట్టడాన్ని చూసి లక్నవరంలో బోట్ షికార్ చేశారు. డీఎం శ్రావణ్‌కుమార్, హెచ్ఎం సుదాడి సుమలత ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సీపీ, ఉద్యోగులు, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, విద్యార్థులు, సుల్తానాబాద్‌లో ర్యాలీ

కోల్‌సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా, అమ్మకం వంటి కార్యకలాపాలను అరికట్టే దిశగా ప్రభుత్వం చేపడుతున్న నషా ముక్త్ భారత్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రస్తుత సమాజాన్ని, యువతను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడం కోసం ప్రజల సహకారం అవసరమని తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, సీపీఓ సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని సీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్, ఏఓ శ్రీనివాస్, వివిధ వింగ్స్ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌గౌడ్, బాబురావు, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, ఆర్ఐలు శ్రీనివాస్ వామనమూర్తి పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి సమాజ అభివృద్ధికి పాటుపడాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో నషా ముక్త్ భారత్ ఐదవ వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడారు. 4జీ, 5జీ టెక్నాలజీ పరుగు పెడుతున్న తరుణంలో దాన్ని అందించిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో జీవితం అలవర్చుకొని తల్లితండ్రులకు గురువులకు సమాజానికి పేరు తెచ్చేలా వ్యవహరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ కలెక్టర్ వనజ, ఆర్డీఓ గంగయ్య, ఎంఈఓ సురేందర్, సీడీపీఓ కవిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజయ్య, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జూనియర్ కళాశాల బాలుర ప్రిన్సిపాల్ సంజీవ్ అన్నారు. కళాశాల (బాలుర), రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయని, ఫలితంగా భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ కమిషనర్ మారుతీప్రసాద్, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మండల విద్యాధికారి రాజయ్యలు కోరారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఎస్ఎస్‌జీ ఆర్పీలు, విద్యార్థులతో నెహ్రూ చౌక్ నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ కొనడం, అమ్మడం, వినియోగం, అక్రమరవాణా అంశాలను గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారిని పునరావాసం కోసం ప్రభుత్వం అందిస్తున్న డీఆడిక్షన్ టోల్ ఫ్రీ నెంబర్ 14446లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రిన్సిపాల్ రత్నాకర్ రెడ్డి, మేనేజర్ అలీ, మెప్మా సీఓ స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అమరేందర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే కలిగే దుష్ప్రభావాలను వివరించారు. చదువుకు అర్ధాంతరంగా స్వస్తి చెప్పే పరిస్థితులు వస్తాయన్నారు.


ఖని కళాశాలలో మత్తుపదార్థాలపై అవగాహన

రిజర్వేషన్లు తేల్చేవరకు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న ఉష

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరికీ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వారకు ఉద్యమం చేపడుతామని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. జిల్లా బీసీ జేఏసీ కమిటీ నిర్మాణ సమావేశాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని మూన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఉష మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పార్టీల వారీగా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటనను విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ఆమె ప్రశ్నించారు. గతంలో తమకు మద్దతు ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉన్న రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఈ అంశాన్ని షెడ్యూల్ 9లో పెట్టడానికి ఎందుకు ప్రయత్నించడం లేదని, రానున్న రోజుల్లో ఉద్యమం మరింత బలపడుతుందన్నారు. బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్, మంద భాస్కర్ యాదవ్, మీడియా ఇన్చార్జి అబ్దుల్ మాలిక్, బీసీ నాయకులు నోమూరి శ్రీధర్, బొద్దుపల్లి లక్ష్మణ్, యుగేందర్, అంజయ్య, గొల్లపల్లి రాజమల్లు, బొంకూరి ఐలయ్య, ఏ.అరుణ, శారద, పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రూపునారాయణ పేటలో గుర్రం అక్షిత గత నెల 24న పాము కాటుకు గురై మృతి చెందగా, మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా గ్రామస్థులు సేకరించిన రూ. 2.20 లక్షలు సేకరించి పోస్టు ఆఫీస్‌లో డిపాజిట్ చేసిన చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అక్షిత మృతిపై సానుభూతిని తెలిపారు. పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంకం రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నీర్ల శ్రీనివాస్ రెడ్డి రజినీకాంత్ పలువురు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం చేస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి రాజయ్య

సుల్తానాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థి ఎంబీబీఎస్ చదువు కోసం ఏకలవ్య ఫౌండేషన్ యేటా ఆర్థికసాయం చేస్తోంది. నీరుకుల్ల గ్రామానికి చెందిన కాదాసి హర్షిత సిద్దిపేటలోని సురభి మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నది. ఆమె తల్లితండ్రులు నిరుపేదలు కావడంతో బహుజన ఏకలవ్య ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కీర్తి చంద్ర రూ.6 వేలు, గౌరవ అధ్యక్షుడు వంగల సుబ్బులు రూ.4 వేలు మంగళవారం అందించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మానుపాటి రాజయ్య, సహాయ కార్యదర్శి బిజిలి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు లక్ష్మి, టిపెట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాకు ర్యాంకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సర్కిల్స్‌లను, డివిజన్‌లను ట్రాన్స్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి ప్రకటించారు. ఇందులో జిల్లాకు ర్యాంకులు వచ్చాయని ఎస్ఈ గంగాధర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి డివిజన్ ద్వితీయ, మంథని తృతీయ స్థానం సాధించిందన్నారు. ఉద్యోగుల కృషితోనే సాధ్య మైందన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరిసీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, న్యాయ విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామ్రాజ్యవాదుల కోసం సైన్యం దేశ పౌరులనే వేటాడడం ఖండిస్తున్నామని, మోదీ, అమిత్ షాలు రక్తపు టేరులు పారిస్తున్నారన్నారు. అమరులైన కామ్రేడ్స్ హిడ్మా, హేమ మరో నలుగురి మృతిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణ సేవా కమిటీ

ధర్మారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దొంగతుర్తిలో నాయీబ్రాహ్మణ సేవా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, శ్రీనివాస్, అధ్యక్షుడిగా ముత్యాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్, ఉపాధ్యక్షులుగా గర్షకుర్తి రాకేష్, మహేష్, కోశాధికారిగా కనకయ్య, ముఖ్య సలహాదారులుగా కిష్టయ్య, చంద్రయ్య, నర్సయ్యలను ఎన్నుకున్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి


కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 433 మంది కల్యాణ లక్ష్మి, షాదీముబాకర్ లబ్దిదారులకు రూ.4.33కోట్ల విలువ గల చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో రూ.4 కోట్లతో మహిళా భవన్, హాల్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. రామగుండం కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముందుకు వెళుతున్నట్టు, 50డివిజన్లలో ప్రజలకు మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, యుగంధర్, దాసరి ఉమాదేవి, సాంబమూర్తి, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయా లని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూ ర్ నాయకులకు, కార్యకర్తలకు సూచిం చారు. పాలకుర్తి, అంతర్గాం మండలాల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రతినిధులు, గ్రామ అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లే విధంగా పాటుపడాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్...


కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఎగ్లాస్‌పూర్ చెందిన మాజీ సర్పంచ్ గంగాధర దేవేమ్మ, రామన్నతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, జెడ్‌పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. తిరుపతినాయక్, హనుమాన్‌రెడ్డి, గీట్ల శంకర్‌రెడ్డి, మడ్డి వెంకటేష్, బరుపటి తిరుపతి, లగిశెట్టి రాకేష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

తేలింది. డెడికేషన్ కమిషన్ మాత్రం 42 శాతం రిజర్వేషన్లు అటు స్థానిక సంస్థల్లోనూ, ఇటు.. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ కల్పించాలని ప్రభు త్వానికి సూచించింది. ఆ మేరకు ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. వాటిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించగా అక్కడి నుంచి రాష్ట్రపతి ఆమోదానికి వెళ్లాయి. అలాగే ఆర్డినెన్స్‌ను కూడా తీసుకు వచ్చింది. వాటికి రాష్ట్రపతి ఆమోదం లభించక పోవడంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోలు విడుదల చేసింది. ఆ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకేసారి మండల జిల్లా పరిషత్ ఎన్నికల తో పాటు, గ్రామపంచాయతీ ఎన్నికలను కూడా నిర్వహించాలని షెడ్యూలు విడుదల చేసింది. ఈ జీవోలను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ జరిపిన హైకోర్టు అఫిడవిట్లు ఆరు మాసాల్లోగా దాఖలు చేయాలని ఎన్నికలపై స్టే విధించింది. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచి పోయింది. ఈ రిజర్వేషన్ల అంశంపై కోర్టు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటుందా, వ్యతిరేకంగా ఉంటుందా అనే విషయం తేలకుండా ఉంది. 15వ ఆర్థిక సంఘం గడువు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు లోగా ముగియనున్నది. దీంతో రాష్ట్రానికి రావలసిన మూడు వేల కోట్ల రూపాయల నిధులు రాకుండా పోతాయని భావించిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రామాల్లో రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్నది.

అసత్య ఆరోపణలు తగదు
- వామన్‌రావు తండ్రి కిషన్‌రావు


మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రావు

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో గోదావరిఖనిలో సీబీఐ విచారణకు హాజరైన అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తనపై అసత్య ఆరోపణలు చేశాడని వామన్‌రావు తండ్రి గట్టు కిషన్‌రావు విమర్శించారు. మంగళవారం మంథనిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వామన్‌రావు దంపతుల హత్యలో పుట్ట మధు ప్రమేయం ఉందని అన్నారు. ఘటన జరిగిన సమయంలో తాను ఇదే ఆరోపణ చేసినా పోలీసు అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ కేసులో రాజీ కోసం మధు తనను ఒక లాయర్ ద్వారా ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారన్నారు. సీబీఐ విచారణ, న్యాయ స్థానాలపై గౌరవం ఉందన్నారు. చివరకు న్యాయమే గెలుస్తుందన్నారు. న్యాయవాది హత్య కేసులో మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్టమధు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాసులపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల చదువు, సంఖ్య, అంగన్‌వాడి కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. కార్యదర్శి షేక్ పాష పాల్గొన్నారు.

రైతులతో బాధ్యతగా మెలగాలి

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సెంటర్ ఇన్‌చార్జీలు రైతులతో బాధ్యతగా వ్యవహరించాలని మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. కార్యాలయంలో సెంటర్ ఇంచార్జీలతో మంగళవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంట అమ్ముకోవటానికి వచ్చే రైతులు, హమాలీలతో సామరస్యంగా వవ్యహరించాలన్నారు.నీడ, తాగునీరు, కల్పించాలన్నారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నాణ్యతతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని సూచించారు. సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ప్యాడి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ప్రోత్సాహకం

గోదావరిఖని, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంలో భాగంగా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ప్రోత్సాహకానికి దరఖాస్తు చేసుకోవాలని సీఎండీ ఎన్ బలరామ్ మంగళవారం తెలిపారు. ఈ పథకంలో భాగంగా గతంలో మెయిన్స్‌కు ఎంపికై ఇప్పటికే లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని, తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు ఎవరైనా ఇంటర్వ్యూలకు ఎంపికైతే వారికి కూడా ఈ ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. సమాచారం లేకపోవడం వల్ల తాము దరఖాస్తు చేసుకోలేదని, సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యామని, తమకు ఆర్థిక ప్రోత్సాహకం అందించాలని పలువురు విజ్ఞప్తి చేశారని, ఈ నేపథ్యంలో వారికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ లోపు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అందజేయాలని కోరారు.

ఆర్జీ-3, ఏపీఏలో క్వార్టర్స్ కౌన్సెలింగ్


క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో అధికారులు

రామగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లకు సంబంధించిన ఖాళీ క్వార్టర్స్‌కు మంగళవారం కౌన్సెలింగ్ చేపట్టారు. ఎస్అండ్‌పిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌లో మొత్తం 170 ఖాళీ క్వార్టర్లు ఉండగా మెడికల్, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్లకు 94 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 37 మంది ఉద్యోగులు హాజరై 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్ర రెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, అధికారులు రామ్మోహన్, సుదర్శనం, సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సునీల్ ప్రసాద్, దుర్గం శ్రీనివాస్, మహేందర్, దాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాతో పాటు అడ్రియాల, ఓసీపీ-2 ప్రాజెక్టుల ఉద్యోగులకు క్వార్టర్‌ల కేటాయించేందుకు మంగళవారం యాజమాన్యం సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించింది. అర్హులైన ఉద్యోగులకు అధికారులు క్వార్టర్‌లను కేటాయించారు. కౌన్సెలింగ్‌లో ఎస్వోటూ జీఎం రాముడు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ శ్యాంసన్, ఏజీఎం పర్సనల్ అరవిందరావు, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, ప్రతాపగిరి రాజు, వేణు పాల్గొన్నారు.

ఓసీపీ-1లో ఉద్యోగులకు క్విజ్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతా వారోత్సవాల్లో భాగంగా ఓసీపీ-1లో ఉద్యోగులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించింది. బొగ్గు నాణ్యత మెరుగుదల, ప్రాముఖ్యత అంశాల మీద మేనేజర్ పాపయ్య నిర్వహించారు. గెలిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం ద్వారా మార్కెట్‌లో నిలదొక్కుకోగలమని మేనేజర్ అన్నారు. ఆరు నెలల క్రితం బదిలీ వర్కర్లుగా చేరి గైర్హాజరీ లేకుండా విధులకు హాజరవుతున్న సర్వే విభాగం మహిళా ఉద్యోగినిలను మేనేజర్ అభినందించారు. ఏరియా స్థాయి సైకిల్ రన్ పోటీల్లో యువ ఉద్యోగులతో పోటీ పడి రీజియన్ స్థాయి పోటీలకు ఎంపికైన బుగ్గాజీని శాలువాతో సన్మానించారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి, అధికారులు బైరి రమేష్, అజయ్, కిషన్, మధు, కిషన్, రాజు, సాయి స్వరూప్‌లతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.